క్లుప్తంగా

24న సామాజిక తనిఖీ

బల్మూర్: మండలంలో 2024–25 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పథకం 15వ సామాజిక తనిఖీ ఈనెల 24న స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాఘవులు, ఏపీఓ సువర్ణలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మండల వ్యాప్తంగా రూ.4.52 కోట్లతో చేపట్టిన 399 పనులు ఉన్నట్లు వారు తెలిపారు. దీంతో పాటు పీఆర్ ఆధ్వర్యంలో నిర్మించిన 49 సీసీరోడ్లు, రూ.15.18లక్షల సామగ్రి ఖర్చుపై ఎస్ఆర్‌పీ ఆధ్వర్యంలో తొమ్మిది మంది డీఆర్‌పీలు, వీఎస్ఏలు గ్రామానికి నాలుగు రోజుల చొప్పున ఈనెల 23 వరకు గ్రామసభలు నిర్వహిస్తారన్నారు.

ఆలయ నిర్మాణానికి ఉప్పల చేయూత



కల్వకుర్తి రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్ తండాలో నూతన దేవాలయ నిర్మాణంతో పాటు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందించారు. ఈనెల 16, 17, 18, 19 తేదీలలో జరిగే బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ దైవచింతనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో గణేష్, రమేష్ గౌడ్, నిర్వాహకులు రాజు నాయక్, బాలు నాయక్, హర్యానాయక్, దేవేందర్, భాస్కర్, బోడు నాయక్ పాల్గొన్నారు.

17వ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



కల్వకుర్తి రూరల్: అఖిల భారత యువజన సమాఖ్య 17వ జాతీయ మహాసభల పోస్టర్‌ను మంగళవారం కల్వకుర్తి పట్టణంలో విడుదల చేశారు. ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఈ మహాసభలకు 29 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న యువజన వ్యతిరేక, కార్పొరేట్ విధానాలు, విద్య, వైద్య ఉపాధి హక్కులు తదితర విషయాలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. 17వ మహాసభలను విజయవంతం చేయాలని శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో ప్రేమ కుమార్, లక్ష్మీపతి, మధు గౌడ్, పరశురాములు, శివుడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

తెలకపల్లి: పార్టీని బలోపేతం చేసే దిశగా పని చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని యోగా బిల్డింగ్‌లో బీజేపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షులు రమణారెడ్డి, రవికుమార్, పరశురాములు, రాముడు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన నవోదయ విద్యార్థులు



మణిదీప్, 10వ తరగతి



సహస్ర, 12వ తరగతి

బిజినేపల్లి: మంగళవారం వెలువడిన సీబీఎస్ఈ ఫలితాల్లో వట్టెం జవహర్ నవోదయ విద్యాలయాకు చెందిన 10, 12వ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పది ఫలితాల్లో మణిదీప్ 476 మార్కులు, తనిష్, భాను ప్రకాష్, దీపక్ 475 మార్కులు సాధించారు. అలాగే 12వ తరగతి ఫలితాల్లో సహస్ర 462 మార్కులు, శ్రీకర్ 461 మార్కు లు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్, అధ్యాపక బృందం అభినందించింది.

పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

కొల్లాపూర్ రూరల్: పార్టీలకతీతంగా పేద వారిని గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కొల్లాపూర్ సీపీఐ కార్యదర్శి ఎస్‌ఎండీ ఫయాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నార్లాపూర్‌లో శాఖ మహాసభలు నిర్వహించారు. కొల్లాపూర్‌లో జరిగే 18వ మండల మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అర్హులైన వారందరికి ఇళ్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తుమ్మల శివుడు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు కురుమయ్య, గ్రామ శాఖ నాయకులు వెంకటయ్య, బాలయ్య, రాముడు, చెన్నకేశవులు, మహిళా సంఘం నాయకురాలు వెంకటమ్మ, గంగమ్మ, కవల మ్మ, జైలమ్మ, లలిత, తదితరులు పాల్గొన్నారు.

చెరువు కబ్జా.. చర్యలేవి?

- ఎఫ్‌టీఎల్ గుర్తించినా కనిపించని చర్యలు
- అక్రమార్కులకు అండగా అధికారులు
- అక్రమ నిర్మాణాలపై చర్యలు శూన్యమేనా?



పట్టణంలోని ఎర్రకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపట్టిన నిర్మాణాలు

కల్వకుర్తి టౌన్: చెరువులను వినియోగంలోకి వస్తే భూగర్భ జలాలు పెరుగుతాయి. వాటిని కబ్జా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అధికారులు చెబుతున్నారు. మున్సిపాలిటీలో 99వ సర్వే నంబర్‌లో ఎర్రకుంటను యథేచ్ఛగా కబ్జా చేసి అక్కడ నిర్మాణాలు చేసినా అదే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గతంలో ఎఫ్‌టీఎల్ పరిధి ఎంత ఉందో తెలియకపోవటంతో చర్యలు తీసుకోలేదని చెప్పుకొచ్చిన అధికారులు, ఎఫ్‌టీఎల్ గుర్తించాక మాత్రం చర్యలు ఎందుకు తీసుకోవటం లేదని ఆరోపణలు వస్తున్నాయి. మాజీ ప్రజాప్రతినిధుల సహకారంతో కబ్జాలు చేయటం, వారికి అధికారుల నుంచి సహకారం ఉండడంతో వారిపై ఎలాంటి చర్యలను తీసుకోవటం లేదు.

ఎఫ్‌టీఎల్‌గా గుర్తించినా!

మున్సిపాలిటీలోని ఎర్రకుంటకు సంబంధించిన ఎఫ్‌టీఎల్‌ను రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు కలిసి గుర్తించి మార్కింగ్ ఇచ్చారు. మున్సిపల్ తరఫున స్థల రక్షణకు హద్దులు ఏర్పాటు చేశారు. ఇదంతా గుర్తించి నెల రోజులైన అక్కడ ఎఫ్‌టీఎల్‌లో ఉన్న అక్రమార్కులపై ఎలాంటి చర్యలు



ఎఫ్‌టీఎల్ పరిధిలో నాటిన స్తంభాలు

తీసుకోకపోవటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎఫ్‌టీఎల్ అని తెలిసినా అక్కడ సంవత్సరం కిందటే నిర్మాణాలు చేపట్టారు. మున్సిపాలిటీ అధికారులు అనుమతులు ఇస్తున్నారు. కార్యాలయంలో పని చేసే కిందిస్థాయి సిబ్బంది సైతం వారికి వత్తాసు పలికి వారిని ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా వెనకేసుకొస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది అక్రమార్కుల విషయంలో మాత్రం ఉదాసీనత చూపిస్తుండడంతో పలు విమర్శలకు తావిస్తోంది.

చర్యలు శూన్యమేనా?

ఎర్రకుంట కబ్జా విషయంలో అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు చేసినా వాటిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవటంతో చర్యలు శూన్యమేనా అని పలువురు చర్చింకుంటున్నారు. గతంలో ఇదే ఊపుతో ఉన్న మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ముడుపులు ముట్టజెపుతుండటంతో వారంతా కిమ్మనకుండా ఉండిపోతున్నారని బహిరంగంగానే చర్చ కొనసాగుతోంది. మున్సిపాలిటీలోని 99వ సర్వే నంబర్‌లో ఉన్న ఎర్రకుంట కబ్జా విషయంలో ఇక్కడికి బదిలీపై వస్తున్న అధికారులకు మంచి వరప్రదాయినిగా మారింది. వచ్చిన వారంతా అక్రమార్కులను పిలిచి మాట్లాడి అమ్యామ్యాలు తీసుకుంటున్నారని పలు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కబ్జాలను అరికట్టి భవిష్యత్ తరాలకు ఎర్రకుంటను కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

హద్దులు ఏర్పాటు చేశాం..

మున్సిపాలిటీలోని ఎర్రకుంటకు సంబంధించి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సూచించిన విధంగా హద్దులు మున్సిపాలిటీ తరఫున ఏర్పాటు చేశాం. అక్రమంగా ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం చేపట్టిన వారికి నోటీసులు జారీ చేసి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటాం. భవిష్యత్ తరాలకు ఎర్రకుంటను వా రసత్వ సంపదగా ఉంచేందుకు కృషి చేస్తున్నాం.

– మహమూద్ షేక్, మున్సిపల్ కమిషనర్, కల్వకుర్తి

చివరి గింజ వరకు కొంటాం

- అదనపు డీఆర్డీఓ

తెలకపల్లి: రైతు పండించిన ప్రతి గింజను కొంటామని అదనపు డీఆర్డీఓ రాజేశ్వరి అన్నారు. మంగళవారం మండల కేంద్రం మార్కెట్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తేమశాతం పేరుతో కొనుగోలు చేయకుండా ఇబ్బందులు గురిచేస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశానుసారం నాణ్యమైన ప్రతి గింజను కొంటామని డీఆర్డీఓ అన్నారు. రైతులు పండించిన ధాన్యం కుళ్లలేకుండా సక్రమంగా ఆరబెట్టుకోని తీసుకురావాలని సూచించారు. సన్నవడ్లు 14తేమ ఉండాలని సూచించారు. దొడ్డు రకం వడ్లకు 15శాతం తేమ ఉన్నా కొనుగోలు చేస్తామన్నారు. తేమశాతం నిబంధనల ప్రకారం ఉండాలని కోరారు. అంతకు ముందు కొనుగోలు కేంద్రం సిబ్బందితో రైతులు నిరసన వ్యక్తం చేశారు. కొనుగోలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముగ్గురు రైతుల దగ్గర 500 బస్తాలు కొనుగోలు చేశామని ఆమె తెలిపారు. ఆమె వెంట డీపీఎం వెంకటేష్, తహసీల్దార్ జాకిర్ అలీ, ఏపీఎం నిరంజన్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు డీఆర్డీఓ రాజేశ్వరి

వరి కొనుగోలు కేంద్రాల పరిశీలన



కోడేరులో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కోడేరు: మండల కేంద్రం, జనుంపల్లి, తీగలపల్లి, ఎత్తం, కొండ్రావుపల్లి, నర్సాయిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ విజయ్‌కుమార్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం విక్రయాలు ఎలా కొనసాగుతున్నాయని రైతులు, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత ఉండటంతో రైతులకు మంచినీటి సౌకర్యం, నీడ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మహేష్, సురేందర్, జంబులయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూ

- హాజరైన దరఖాస్తుదారులు
- పాల్గొన్న ఆయా బ్యాంకు మేనేజర్లు, అధికారులు



కొల్లాపూర్‌లో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న బ్యాంకు మేనేజర్, ఎంపీడీఓ

సాక్షి, నెట్‌వర్క్: రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు ఆయా మండలాల్లో మంగళవారం అధికారులు, బ్యాంకుల మేనేజర్లు ఇంటర్వ్యూ నిర్వహించారు.

- నాగర్‌కర్నూల్ రాజీవ్ యువ వికాసం దరఖాస్తులకు సంబంధించి నాగర్‌కర్నూల్ మున్సిపల్ పరిధిలోని దరఖాస్తుదారులకు మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో 1063 దరఖాస్తులు రాగా, ఇంటర్వ్యూకు 568 మంది మాత్రమే హాజరయ్యారు.
- మన్ననూర్ పరిధిలో రెండు రోజులుగా అమ్రాబాద్, పదర మండలాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతకు ఇంటర్వ్యూ నిర్వహించారు. దరఖాస్తుదారుల ధ్రువపత్రాలను ఎంపీడీఓ వెంకటయ్య, అమ్రాబాద్ ఎంపీడీఓ జగదీశ్వర్, గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ లక్ష్మణ్‌నాయక్‌లు పరిశీలించారు.
- బల్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజు ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్, కొండనాగుల గ్రామీణ వికాస్ బ్యాంక్ మెనేజరు శశాంక్ ఇంటర్వ్యూ నిర్వహించారు.
- అచ్చంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మన్ననూరు ఎస్‌బీఐ బ్యాంకు మేనేజరు, ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్, పంచాయతీ అధికారి లింగయ్య దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు.
- లింగాల మండల పరిషత్ కార్యాలయంలో లింగాల, అచ్చంపేట ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు.
- కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు వారు, మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ పాల్గొన్నారు.
- కోడేరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నాగమహేష్, ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ ఇంటర్వ్యూ చేశారు. కార్యక్రమంలో క్యాషియర్ వినోద్‌కుమార్, సాహిద్, గురుబ్రహ్మ, తదితరులు పాల్గొన్నారు.
- వెల్దండ మండల పరిషత్ కార్యాలయంలో నిరుద్యోగులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. వెల్దండ ఎస్‌బీఐ పరిధిలో 538 మందికి గాను, 354 మంది హాజరయ్యారు. పెద్దాపూర్ కెనరా బ్యాంక్ పరిధిలో 560 మంది దరఖాస్తు చేసుకోగా, 238 మంది హాజరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మణ్ పేర్కొన్నారు.



వెల్దండలో ఇంటర్వ్యూకు హాజరైన నిరుద్యోగులు

నేడు ఇంటర్వ్యూ

- వెల్దండ మండల పరిధిలోని ఆయా గ్రామాలకు బుధవారం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మణ్ తెలిపారు. పోతేపల్లి, లింగారెడ్డిపల్లి, సిలోనిబావితండా, బైరాపూర్, పోచమ్మగడ్డతండా, ఎంజీతండా, నాగారగడ్డతండా, అల్లంతోటబావితండా, వెల్దండ, కంటోనిపల్లి, గుండాల గ్రామాలకు వెల్దండ ఎస్‌బీఐ, జూపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్, పెద్దాపూర్ కెనరా బ్యాంక్ పరిధిలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

బైరాపూర్‌లో రథోత్సవం



వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు అధికసంఖ్యలో హాజరై రథాన్ని లాగారు. అనంతరం ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు పూజలు చేశారు. రథోత్సవంలో వెల్దండ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి, శశికళ, రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, ఉపసర్పంచ్ రమేష్‌గౌడు, రాజుయాదవ్, నరసింహ, జంగయ్య, శ్రీశైలం, బీజేపీ నాయకులు శేఖర్‌రెడ్డి, బాలస్వామి, జంగయ్యయాదవ్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసచారి, గ్రామ పెద్దలు, యువజన సంఘం నాయకులు ఉన్నారు.

సిర్సవాడలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

తాడూరు: మండలంలోని సిర్సవాడలో నాలుగు రోజుల నుంచి లక్ష్మీనర్సింహబ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి పల్లకీసేవ ఊరేగింపు, చక్రస్నానం, భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు ముగిశాయి. అమ్మవారికి బోనాలు, ఎండ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. ఎస్ఐ గురుస్వామి కథనం ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన రాజు ఆటోలో తన భార్యాపిల్లలతో కలిసి ఈ నెల 10న మండలంలోని గుంతకోడూరు గ్రామంలో మిరపకాయలు తీయడానికి వచ్చారు. అయితే తాడూరు సమీపంలో ఆటో అదుపు తప్పి కిందపడగా.. రాజు భార్య చెన్నమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈ ఘటనపై చెన్నమ్మ తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిరుత దాడిలో లేగ మృతి

లింగాల: చిరుతపులి దాడిలో లేగ దూడ మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని జీల్లుపల్లి సమీపంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు సైదులు లింగాల వెళ్లే మార్గంలో ఉన్న దేవుని గట్టు దగ్గర పశువుల పాకలో పశువులను ఉంచి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లి చూడగా లేగ దూడ మృతిచెందినట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలాన్ని అటవీ శాఖ బీట్ ఆఫీసర్ ఖాదర్‌పాష పరిశీలించి పంచనామా నిర్వహించారు.

రెండు బైకులు ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని నార్లాపూర్ గ్రామ సమీపంలో పెద్ద వాగు బ్రిడ్జి దగ్గర ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కుడికిల్ల గ్రామానికి చెందిన జంగం రామకృష్ణ ముక్కిడిగుండం గ్రామం నుంచి వస్తున్నాడు. నార్లాపూర్ గ్రామానికి చెందిన సాకలి వెంకటయ్య బైక్‌పై ఎదురుగా వస్తున్నాడు. ప్రమాదవశాత్తు రెండు బైకులు ఢీకొన్నాయి. రామకృష్ణ ఎడమ కాళ్లు విరిగింది. వెంటనే కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు ప్రథమ చికిత్సలు చేసి, నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ సభ్యుడి నియామకం



రాములుకు నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి రూరల్: మండలంలోని జిల్లెల గ్రామ మాజీ సర్పంచ్ గుమ్మకొండ రాములును ప్రభుత్వం జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ ఆదేశాలు మంగళవారం జారీ చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా సభ్యుడిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సిఫార్సు మేరకు నియామకం చేశారు. హైదరాబాద్ వెళ్లి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపా రు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ మెంబర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచులు ఆనంద్‌కుమార్, భూపతిరెడ్డి, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, నాయకులు గోరటి శీ ను, చిన్న రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు సిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, షానవాజ్, దామోదర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ నాయక్, హరీష్ రెడ్డి, రవి గౌడ్, రవి, భా స్కర్, వెంకటేష్, చంద్రకాంత్, సురేష్, పరుశురాం పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



కార్యక్రమంలో నర్సులను సన్మానం చేస్తున్న క్లాస్మేట్ క్లబ్ సభ్యులు

నాగర్‌కర్నూల్ క్రైం: వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘు అన్నారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవాన్ని జనరల్ ఆస్పత్రిలో మంగళవారం క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించి నర్సులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూప రింటెండెంట్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో వైద్యుల తర్వాత నర్సుల సేవలు గొప్పవని అన్నారు. ప్రభుత్వం సా ధారణ ఆస్పత్రిలో ప్రతిరోజు 1200 మందికి పైగా ఔట్ పేషెంట్లకు వైద్యులు, నర్సులు ఆరోగ్య సేవ లు అందిస్తున్నారన్నారు. ప్రతి నెల 480 పైగా గర్భిణులకు ఆస్పత్రిలో ప్రసవాలు, ఇతర సేవలు చేస్తున్నట్లు తెలిపారు. నర్సులు, నర్సింగ్ ఆఫీసర్ల ఆరో గ్య సేవలు రోగులు మరువలేరని, వారి సేవ లు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ రీసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి శంకర్ నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ ఏ.రోహిత్, క్లాస్మేట్ క్లబ్ వైద్యులు డాక్టర్ పి లక్ష్మణ్, క్లాస్మేట్ క్లబ్ సభ్యులు రామ్‌చందర్, నర్సింగ్ ఆఫీసర్లు అమృత, ఎం ఆనంద్, సునీత పుష్పలత, రేవతి, చంద్రకళ, అనసూ య, ఆస్పత్రి హెల్ప్ డెస్క్ ఇన్‌చార్జి టి.యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

అచ్చంపేట రూరల్: నిరుపేద మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఎస్‌బీఐ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ శేఖరయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హాజీపూర్ వద్ద ఫౌండేషన్ తరుపున లబ్ధిదారులకు మేకలను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌బీఐ ఫౌండేషన్ సీఎస్ఆర్ చొరవతో ప్రాజెక్టు ద్వారా మహిళలకు జీవనోపాధి కల్పిస్తున్నామన్నారు. మండలంలోని సింగారం, చెన్నారం, చందాపూర్, బ్రాహ్మణపల్లి, కన్యతండా, అంకిరోనిపల్లి, పులిజాల గ్రామాలకు చెందిన 70మంది నిరుపేద మహిళలకు ఒక్కొక్కరికి మూడు చొప్పున 210 మేకలను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు భాను, వెటర్నరీ డాక్టర్ సాయితేజ, అన్వేష్, వివిధ గ్రామాల గ్రూప్ లీడర్లు, మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.



మహిళకు మేకలను పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ ఫౌండేషన్ ప్రతినిధులు

కార్మిక వ్యతిరేక విధానాలు సరికాదు



సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేస్తున్న శానిటేషన్ సిబ్బంది

నాగర్‌కర్నూల్ రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికవర్గం క దంతొక్కి రావాలని సీఐటీయూ జిల్లా సహాయ కా ర్యదర్శి పోదిల రామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘుకు శానిటేషన్ సిబ్బంది సమ్మె నోటీసు అందజేశారు. కార్మికుల కనీసం వేతనం రూ.26వేలు అమలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు నెల ల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు శానిటేషన్ కార్మికులు బాలక్రిష్ణమ్మ, బాలమని, రేణుక, వెంకటమ్మ, అలివేలు, శేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘం డబ్బులు రికవరీ చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: దళిత మహిళా సంఘం డబ్బులు రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతటి కాశన్న మాట్లాడుతూ తాడూరు మండలం గోవిందాయపల్లిలో ఎస్సీ గ్రూప్ అరుందతి మహిళా సంఘం సభ్యుల అనుమతి లేకుండా రూ.39,500లు గ్రామ సంఘం మాజీ అధ్యక్షురాలు డ్రా చేసిందని, ఐదేళ్లు కావస్తున్నా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సంఘం డబ్బులు తమకు ఇవ్వాలని అడిగితే వారిని గ్రామ సంఘం మాజీ అధ్యక్షురాలు కించపరిచేలా మాట్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి డబ్బులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో కురువమ్మ, క్రిష్ణమ్మ, బొజ్జమ్మ, మాసమ్మ, బాలనాగమ్మ, రామేశ్వరమ్మ, వెంకటమ్మ, ఐశ్వర్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మహిళా సంఘం సభ్యులు

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

తిమ్మాజిపేట: ఖరీఫ్ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో స్థానిక వ్యవసా అధికారులు రైతు నేస్తం పేరుతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ నుంచి రాష్ట్ర స్థాయి వ్యవసాయ అధికారులు ఖరీఫ్ పంట ప్రారంభంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ కమల్‌కుమార్, ఆయా గ్రామాల ఏఈఓలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

- తాడూరులో రైతులు పంటల సాగులో రసాయనిక వాడకం తగ్గించి వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని వ్యవసాయ కేవీకే శాస్త్రవేత్త సుమలత, పరమేష్ తెలిపారు. సదస్సులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో శోభారాణి, సందీప్ కుమార్, ఏఈఓ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



తాడూరులో మట్టి నమూనా సేకరణపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రైతులు పంట మార్పిడి చేపట్టాలి

పెద్దకొత్తపల్లి: రైతులు పంట మార్పిడి చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణ అన్నారు. చెన్నపురావుపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు వేసవి దుక్కులు తయారు చేసుకుని పంట మార్పిడి చేసి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. 82 మంది రైతులు, వ్యవసాయ శాఖ అధికారి శిరీష పాల్గొన్నారు.